క్లుప్తంగా

పరీక్ష కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించండి

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా మంగళవారం కలెక్టర్‌ను ఒక ప్రకటనలో విన్నవించారు. పాల్వంచ మండలం పాండురంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 56మంది విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉప్పుసాక గ్రామంలో, యానంబైల్ హైస్కూల్‌కు చెందిన 18మంది విద్యార్థులు మూడుకిలోమీటర్ల దూరంలో ఉన్న కిన్నెరసాని పరీక్ష కేంద్రానికి కాలి నడకన వెళ్లి పరీక్షలు రాస్తున్నారని, విద్యార్థులు సొంత ఖర్చులతో ఆటోలో.. కొంతమంది కాలినడకన వెళ్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రంథాలయానికి వితరణ

పాల్వంచ: పట్టణంలోని గ్రంథాలయానికి లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ గోల్డ్ ఆధ్వర్యంలో రెండు రీడింగ్ బల్లలను వితరణ చేశారు. మంగళవారం గ్రంథాలయంలో టేబుల్స్ అందించిన దాతలు పుట్టా నాగేశ్వరరావు, పాత్రు సతీశ్ వాటిని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు చాట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు ఆరుద్ర సత్యనారాయణ, లైబ్రేరియన్ కె.మధుకుమార్, రాచకొండ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఆడుకుంటున్న ప్రభుత్వం

ఇల్లెందురూరల్: పదో తరగతి విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు భూక్య శ్యాం విమర్శించారు. సంఘం కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలు ప్రారంభమైన తొలిరోజునే ప్రశ్నపత్రం లీకైందని, రెండోరోజు హిందీ ప్రశ్నపత్రం కూడా లీకవడంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. విద్యార్థులు రాత్రింబవళ్లు చదువుకొని పరీక్షకు హాజరైతే పరీక్ష పేపర్ లీకై పరీక్షను మళ్లీ నిర్వహిస్తారేమోననే ఆందోళన చెందుతున్నారని తెలిపారు. దీనికి ప్రధాన కారణమైన ఎస్‌ఎస్‌సీ బోర్డు ఉన్నతాధికారులపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు పరీక్ష విధానంలో సమూల మార్పులు తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహేందర్, పవన్ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కవిత

ఇల్లెందురూరల్: ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు విజయలక్ష్మీనగర్ సర్పంచ్ పూనెం కవిత అన్నారు. మండలంలోని విజయలక్ష్మీనగర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇల్లెందు–గుండాల ప్రధాన రహదారిపై గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ పరిధిలో ప్రజలకు సౌకర్యాలు మెరుగుపరుస్తూ సామాజిక బాధ్యతగా చలివేంద్రం ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పూనెం సురేందర్, వార్డు సభ్యుడు క్లింట్, కార్యదర్శి సుస్మిత, పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: మండలంలోని బంధ్రుగొండ గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం సర్పంచ్ పద్మ ప్రారంభించారు. నిమ్మల రాంబాబు పాల్గొన్నారు.

జీఓపై అధికారుల హర్షం

చుంచుపల్లి: అటవీశాఖలో వివిధ స్థాయిల్లో, క్షేత్రస్థాయిల్లో పని చేస్తూ సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులకు సీఎం కేసీఆర్ విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 43 వరం లాంటిదని భద్రాద్రి సర్కిల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఓ విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అటవీ అధికారులు, ఉద్యోగులకు భరోసా కల్పిస్తూ ఉద్యోగి మరణిస్తే రూ.30 లక్షల నుంచి రూ.75లక్షలు, శాశ్వత అంగవైకల్యం కలిగితే రూ.20లక్షలు నుంచి రూ.50లక్షలు, గాయపడిన ఉద్యోగులకు రూ.3 నుంచి 6 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తూ జీఓ విడుదల చేయడం హర్షణీయమన్నారు. సీఎం కేసీఆర్‌తో పాటు సహకరించిన మంత్రులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాయితీ పొందండి

కొత్తగూడెంఅర్బన్: ఇంటి పన్నులో 5 శాతం రాయితీని కొత్తగూడెం పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్నులు ముందస్తుగా ఈ నెల 30వ తేదీలోగా చెల్లించే వారికి 5 శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం..!

- మౌలిక వసతులు లేని లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ
- అధికారులు, ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం
- అవస్థలు పడుతున్న స్థానికులు


అద్దె భవనంలో లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీ భవనం

పాల్వంచరూరల్: తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని ప్రభుత్వం ఏర్పాటు చేసిన గిరిజన పంచాయతీలో నిధులు మంజూరు కాక అభివృద్ధికి నోచుకోక స్థానికులు అవస్థలు పడుతున్నారు. మారుమూల గిరిజన గ్రామపంచాయతీ అయిన లక్ష్మీదేవిపల్లి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. అధికారుల నిర్లక్ష్యంతో మౌలిక సౌకర్యాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో పంచాయతీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఉల్వనూరు లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలో మొత్తం 8 వార్డులు ఉండగా 891 మంది జనాభా. పంచాయతీకి పక్కా భవనం లేకపోవడంతో అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. పంచాయతీకి వచ్చిన నిధులు కూడా సిబ్బంది జీతాలకు, పారిశుద్ధ్యం పనులకు, ట్రాక్టర్ అద్దెలకే సరిపోవడంతో పంచాయతీలో సీసీ రోడ్లు గానీ, డ్రెయినేజీలు గానీ ఇతర అభివృద్ధి పనులకు నేటికీ నోచుకోవడం లేదు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరదనీటితో వీధులన్నీ బురదమయం. నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతుంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అంటువ్యాధుల బారిన పడాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఏర్పడి నాలుగేళ్లు దాటినా నేటికీ అద్దె భవనంలోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల పక్కాభవనం మంజూరైనా నేటికీ పనులు ప్రారంభించ లేదు.


సీసీ రోడ్డు లేక అధ్వానంగా ఓ వీధి

అధికారులు వివక్ష చూపుతున్నారు



పంచాయతీ ఏర్పడిన తరువాత అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు. అధికారుల వివక్ష కారణంగా మౌలిక వసతులు కల్పించలేక పోతున్నాం. పలుమార్లు అధికారులు, ఎమ్మెల్యేకు విన్నవించినా నేటికీ ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు.

– భిక్షమయ్య, సర్పంచ్, లక్ష్మీదేవిపల్లి

సీసీ రోడ్లు నిర్మించాలి



గ్రామపంచాయతీ ఏర్పడ్డ తర్వాత నేటికీ ప్రభుత్వం ద్వారా మౌలిక సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు కాలేదు. దీంతో అభివృద్ధిలో పంచాయతీ బాగా వెనకబడి పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంచాయతీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి.

– సురేష్, లక్ష్మీదేవిపల్లి

ప్రతిపాదనలు పంపించాం



లక్ష్మీదేవిపల్లి గ్రామపంచాయతీలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే ముందుగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మాణం చేస్తాం. గ్రామపంచాయతీకి పక్కా భవనం మంజూరైంది. త్వరలో నిర్మాణం చేపడతాం.

– జి.రవీంద్రప్రసాద్, ఎంపీడీఓ

పోషకాహారంతో ఆరోగ్య రక్షణ


చిరుధాన్యాల వంటకాలు, గర్భిణులతో సీడీపీఓ

టేకులపల్లి: పోషకాహారంతోనే ఆరోగ్య సంరక్షణ కలుగుతుందని తల్లీబిడ్డలు ఆయురారోగ్యాలతో ఉంటారని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కాంపెల్లి మంగతార అన్నారు. గత నెల 20న ప్రారంభమైన పోషణ్ పక్వాడా వారోత్సవాలు మంగళవారంతో ముగిసాయి. ఈ మేరకు మండలంలోని తావుర్యాతండా, తడికలపూడి పంచాయతీల స్థాయిలో తావుర్యాతండాలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పోషణ్ దివస్, చిరుధాన్యాలతో వంటల ప్రదర్శన, గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం నిర్వహించారు. తల్లులకు పోషకాహారం, చిరుధాన్యాల వంటకాలు, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆకుకూరలు, కూరగాయల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ అరుణ, సర్పంచ్‌లు తేజావత్ రమేష్, ఊకె నర్సమ్మ, సూపర్‌వైజర్ గుర్రం శ్రీలక్ష్మి, ఐసీపీసీ సారిక, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగానే 1/70 చట్టం

సింగరేణి(కొత్తగూడెం): భారతదేశ ప్రజలు దేశ (ఎల్లలు) హద్దులు ఉన్నంత వరకు ఎక్కడైనా స్థిర నివాసం ఏర్పరచుకోవచ్చని రాజ్యాంగం హక్కు కల్పించినప్పటికీ, రామవరం ప్రాంత ప్రజలకు నివాస ధ్రువీకరణ హక్కు లేకపోవటం, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని 10వ వార్డు కౌన్సిలర్ మునిగడప పద్మ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం జీఓ 76 ద్వారా సింగరేణి ప్రాంతంలో అన్యాక్రాంతం చేసుకొని 2020 నాటికి స్థానిక నివాసం ఇస్తాము అన్నదానిలో రామవరం ప్రాంతం పేరు లేకపోవటం బాధాకరమన్నారు. 1/70 చట్టం పేరుతో రామవరం ప్రజలకు పట్టాలు పొందే హక్కు లేకపోవటం వలన యాజమాన్య హక్కులు లేకుండా పోయాయని వాపోయారు. 1/70 చట్టం యాజమాన్య హక్కుకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఇప్పటికైనా పాలకులు కనీసం (హక్కు పత్రాలు) ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. గంటాడి కోటేశ్వరరావు, రాజం, గోపి, చందు, జలీల్, మార్తమ్మ పాల్గొన్నారు.

విద్యారంగంపై సవతితల్లి ప్రేమ



మాట్లాడుతున్న మధు

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై సవతి తల్లి ప్రేమ కనబరుస్తోందని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ మధు విమర్శించారు. మంగళవారం గుండెపుడిలో జరిగిన గిరిజన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంపై సరైన అవగాహన లేకుండా పాలకులు పాలిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు అధికార కాంక్షపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేకపోవడం శోచనీయమన్నారు. పదో తరగతి తెలుగు, హిందీ ప్రశ్నపత్రాలు వికారాబాద్, వరంగల్ జిల్లాల్లో లీకేజీ కావడంతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో బీఆర్‌ఎస్ సర్కార్ విఫలమైందన్నారు. టెన్త్ ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడుతున్న వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మనోధైర్యం కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇస్లావత్ భద్రు, భూక్యా సురేష్, బోడా లక్మా, గుగులోత్ రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

టేకులపల్లి: కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో ఇటీవల తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం చెల్లించాలని అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి బి.భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంఘం రాష్ట్ర కార్యవర్గం సమావేశం జరిగింది.మాట్లాడుతూ... పంట నష్టం వివరాలు పారదర్శకంగా చేయాలని, అధికారులు రైతులను మోసం చేయవద్దన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి మొక్కజొన్న, పత్తి, మిర్చి, వరి పంటలు, మామిడి తోటలు, కూరగాయల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మామిడాల భిక్షపతి, గొని ఐలయ్య, రామచంద్రయ్య, యదళ్లపల్లి సత్యం, గంగారెడ్డి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల నిఘా


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులోని పదో తరగతి రెండు పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు నిఘా పెట్టారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమైన మొదటి రోజే వికారాబాద్ జిల్లా తాండూరులో తెలుగు ప్రశ్నపత్రం వాట్సాప్‌లో ప్రత్యక్షం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేసింది. దీంతో అధికార యంత్రాంగం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మంగళవారం జూలూరుపాడు సీఐ జె.వసంతకుమార్ పర్యవేక్షణలో ఎస్సై పోటు గణేష్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సీఐ పరీక్ష కేంద్రాలను పరిశీలించి, పోలీస్ సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అయితే వరంగల్ జిల్లాలో హిందీ ప్రశ్నపత్రం లీకైనట్లు వదంతులు రావడంతో పరీక్ష కేంద్రాల వద్ద విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న పాలకులు


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఇల్లెందురూరల్: ఉపాధి హామీ పథకాన్ని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు తుపాకుల నాగేశ్వరరావు, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి సారంగపాణి ఆరోపించారు. మంగళవారం సంఘం కార్యాలయంలో గుండాల ఎంపీపీ ముక్తి సత్యం అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధి కూలీలకు కొలతలు కాకుండా రోజువారీ కూలి రూ.750 మంజూరు చేయాలని, పనిప్రదేశంలో కనీస సౌకర్యాలు మెరుగుర్చాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఏఐకేఎంఎస్ చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలలో కూలీలు భాగస్వాములు కావాలని కోరారు.

ఉత్తర్వులు అందజేత


ఉద్యోగులతో ఏరియా జీఎం షాలేమురాజు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు మార్చి 1 నాటికి అర్హత కలిగిన వారికి కేడర్ స్కీం/ టైం బాండ్ ప్రమోషన్స్ ఇచ్చారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎనిమిది మందికి జీఎం ఎం.షాలేమురాజు చేతుల మీదుగా పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మార్చి, సెప్టెంబర్‌లో కేడర్ స్కీం ప్రమోషన్స్ అందజేస్తున్నామని వీరికి అందాల్సిన ప్రయోజనాలు మార్చి వేతనం నుంచి అందుతాయని తెలిపారు. ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలని, వృత్తిలో నైపుణ్యం పెంచుకోవాలని, రక్షణతో పని చేయాలని, సంస్థకు మంచిపేరు తీసుకురావాలని కోరారు.

పోస్టు కార్డు ఉద్యమం


పోస్టుబాక్స్‌లో కార్డులు వేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: టీఎస్పీఎస్సీలో ప్రశ్నపత్రాలు లీకై దాదాపు 20 రోజులు కావస్తున్నా సీఎం కేసీఆర్ ఎందుకు నోరు మెదపడం లేదని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి యెర్రా కామేష్ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ మౌనం విడాలని చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉత్తరాలు రాస్తూ పోస్టల్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సిట్ అధికారులు పిలిపించి తూతూ మంత్రంగా విచారించి పంపించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పాత్రధారులు, సూత్రధారులు బయటపడాలంటే టీఎస్పీఎస్సీ చైర్మన్‌ను తక్షణమే విధుల నుంచి తప్పించి, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ చేయాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ ఇకనైనా స్పందించాలని డిమాండ్ చేశారు.

ప్రతీ కుటుంబానికి సంక్షేమ ఫలాలు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ

ఇల్లెందురూరల్: రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తూ సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయారని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పట్టణ, మండల పరిధిలోని 69 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలలో భాగంగా మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద కుటుంబాలు కూడా వివాహ వేడుకలను ఘనంగా నిర్వహించుకునేలా సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరుతో ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ప్రతి గ్రామంలోనూ సగానికి పైగా కుటుంబాలకు ఈ పథకాలలో భాగంగా లబ్ధి చేకూరిందని గుర్తుచేశారు. వీటితోపాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలను నేరుగా అందిస్తూ ప్రతి కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునేలా సీఎం కేసీఆర్ జనరంజక పాలన అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లోనూ సీఎం కేసీఆర్‌కు ప్రతికుటుంబం అండగా నిలిచి మరిన్ని సంక్షేమ పథకాలను తమ సొంతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ల మాధవరావు, జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమాదేవి, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, ఆత్మచైర్మన్ బావ్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రజల గోస పట్టని ప్రభుత్వాలు


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులు సామాన్య ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ విమర్శించారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపులో భాగంగా హాథ్ సే హాథ్ జోడో యాత్ర పాల్వంచ మండలం తోగ్గూడెంలో మంగళవారం ఎడవల్లి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. పోడు భూములకు పట్టాలు ఇస్తామని, నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం నేటికీ అమలు చేయడం లేదన్నారు. ధరణి పేరుతో రైతులను దగా చేస్తోందన్నారు. దళితబంధువు పేరుతో దళితులను మోసం చేసిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలపై భారం మోపిందని విమర్శించారు. కేంద్రప్రభుత్వం రాహుల్ గాంధీని రాజకీయంగా ఎదుర్కోలేక ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కొండం వెంకన్న, బత్తుల వెంకటేశ్వరరావు, రామునాయక్, రామ్మూర్తి, కృష్ణంరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడి తీరు సరికాదు

చుంచుపల్లి: డీసీసీ అధ్యక్షుడు పోదెం వీరయ్య ఒంటెద్దు పోకడ సరికాదని, మార్చి 31న ఆయన క్యాంపు కార్యాలయంలో సీనియర్ నాయకుడు పోతురెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై దాడి చేయడం అమానుషమని జిల్లా కాంగ్రెస్ నాయకులు లక్కినేని సురేందర్, డాక్టర్ శంకర్ నాయక్, పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు గురజాల గోపి తదితరులు ఖండించారు. మంగళవారం విద్యానగర్‌లో నిర్వహించిన జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. పినపాకలో జరుగుతున్న రాజకీయాల గురించి మాట్లాడాలని భద్రాచలం పిలిచిన వీరయ్య సహనం కోల్పోయి శ్రీనివాస్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు ఇంతకు ముందు కూడా జరిగాయని మళ్లీ పునరావృతం కాకుండా ఉండేందుకు ఈ నెల 9న హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద 500 మందితో నిరసన దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. కొమరం కాంతారావు, బొలమూరు రాజు, రవీందర్‌రెడ్డి, చంద వరప్రసాద్, బోగినేని వరలక్ష్మి, రహింఖాన్, కోటంరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలను ఎండగట్టాలి



మాట్లాడుతున్న సాబీర్ పాషా

పాల్వంచ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫలాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు ప్రతి కార్యకర్త సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. మంగళవారం స్థానిక సీఆర్ భవన్‌లో రేసు ఎల్లయ్య అధ్యక్షతన ప్రజా సంఘాల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ.. దేశంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత రోజురోజుకు ప్రజల మధ్య విద్వేషాలు పెరిగిపోయాయన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. రాష్ట్రాల హక్కులను హరించివేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలను అణిచివేయాలనే కుట్రలతో అవినీతి ఆరోపణలు అంటగడుతూ ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో కేసులు పెట్టిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ఆయకట్టు పెంచి జిల్లా రైతాంగానికి మేలు చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 14 నుంచి జిల్లాలో చేపట్టే సీపీఐ ప్రజాపోరు యాత్రలో ప్రజా సంఘాల నాయకులు ముఖ్యపాత్ర వహించాలని కోరారు. కార్యక్రమంలో ఏపూరి బ్రహ్మం, మున్నా లక్ష్మీకుమారి, సలిగంటి శ్రీనివాస్, రాహుల్, బల్ల సాయికుమార్, అక్కి నరసింహారావు, భూక్యా శ్రీను, ఎస్కే.నాగుల్ మీరా, విజయ్, ఉపేందర్, సృజన్, వికాస్, రాము, సురేందర్, రాంబాబు, ధనలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా రేషన్ పంపిణీ చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

ఇల్లెందురూరల్: రేషన్‌షాపుల ద్వారా 12 రకాల వస్తువులను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి చంద్ర అరుణ, పీవైఎల్ జిల్లా కార్యదర్శి వాంకుడోత్ అజయ్ డిమాండ్ చేశారు. రేషన్ షాపులలో సరుకుల పంపిణీపై ఈ నెల 15వ తేదీ నుంచి చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణపై ప్రచార పోస్టర్లను మంగళవారం ఇల్లెందులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గూగుల్ పే, ఫోన్ పే, బ్యాంకింగ్ వ్యవస్థపై పన్నుల భారం మోపడం సిగ్గుచేటన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలను రోజురోజుకు పెంచుతూ సామాన్యుల నడ్డివిరుస్తున్నారని విమర్శించారు. దరఖాస్తు చేసుకున్న నాలుగేళ్లకు కూడా రేషన్‌కార్డులు మంజూరు చేయకపోగా, రేషన్‌షాపులలో గతంలో ఇచ్చిన తొమ్మిది రకాల నిత్యావసరాలలో కోత విధించారని ధ్వజమెత్తారు. వంట గ్యాస్ సబ్సిడీ పెంచడంతోపాటు 12 రకాల నిత్యావసర వస్తువులు రేషన్‌షాపుల ద్వారా మంజూరు చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బుచ్చిరాజు, కల్పన, బండారి సత్యం, యనగంటి గణేష్, పద్మ, గంగ, లక్ష్మి, దుర్గ, రామకృష్ణ, దేవా, ముత్తక్క, సరోజిని, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఏ క్షణమైనా పడిపోవచ్చు..!



ఈ విద్యుత్ స్తంభం ఎప్పుడు పడిపోతుందో.. ప్రమాదం పొంచి ఉంది. పాల్వంచ మండలం పునుకుల గ్రామ శివారులోని కిన్నెరసాని వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ రైతు పంటచేను మధ్యలో విద్యుత్ స్తంభం ఒరిగి ఏ క్షణమైనా కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎండాకాలం. గాలివానలకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

– పాల్వంచరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : రవీందర్,
విద్యుత్‌శాఖ ఏఈ, పాల్వంచరూరల్
సెల్ నంబర్ : 9440811564